సీఎం వైఎస్ జగన్ సభకు భారీ ఏర్పాట్లు

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని మినీస్టేడియంలో శుక్రవారం నిర్వహించనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన సీఎం సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. సీటింగ్, వాహనాల పార్కింగ్, తాగునీరు, భోజనాలు, తదితర వసతులపై అధికారులతో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీఎం సభకు సంబంధించిన ఏర్పాట్లను వివరించారు. చుక్కల భూముల సమస్య నుంచి రైతులకు విముక్తి కల్పించేందుకు కావలికి వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికేందుకు కావలి నియోజకవర్గం నుంచి భారీగా ప్రజలు తరలివస్తున్నారని తెలిపారు. సుమారు 50 వేల మందికిపైగా తరలివచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగిన విధంగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. వేసవి తీవ్రతను సైతం లెక్క చేయకుండా పల్లెల నుంచి రైతులు, మహిళలు సీఎం సభకు తరలి రానుండడంతో ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎండ వేడిని తప్పించుకునేలా, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ప్రజలు ఉదయం తొమ్మిది గంటలకే సభాస్థలానికి చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభా స్థలానికి చేరుకునే ప్రజలు తమకు కేటాయించిన సీట్లలో కూర్చోవాలని విజ్ఞప్తి చేశారు. వేసవి తీవ్రతకు ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యేకంగా కూలర్లు,తాగునీరు, స్నాక్స్‌తో పాటు ఒకేసారి 50 వేల మంది భోజనాలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

కావలికి వరాల జల్లు

కావలి సభలో నియోజకవర్గ ప్రగతిపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాల జల్లు కురిపించే అవకాశం ఉందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలు వరుసగా రెండుసార్లు వైఎస్సార్‌సీపీని గెలిపించారనే అభిమానంతో కావలి ప్రాంత ప్రగతి విషయంలో సీఎం మొదటి నుంచి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణాల ద్వారా కావలి నియోజకవర్గ రూపురేఖలు మారుస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. చుక్కల భూములపైన నిషేధం ఎత్తివేయడంతో కావలి నియోజకవర్గంలో ఏడు వేల ఎకరాలకు మోక్షం కలగనుందని వివరించారు.

ఎల్లో మీడియాపై ఆగ్రహం

కావలి నియోజకవర్గ ప్రజలకు మంచి చేసేందుకు వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు భారీ ఏర్పాట్లు జరుగుతుండడం, ప్రజలు భారీగా తరలివచ్చే అవకాశం ఉండడంతో పచ్చమీడియా అసత్యాలు ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటోందని ఎమ్మెల్యే మండిపడ్డారు. హెలిప్యాడ్ వద్ద ఫ్లెక్సీల ఏర్పాట్లలో ప్రొటోకాల్ ఉల్లంఘన అంటూ అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. వాస్తవాలు తెలుసుకుని వార్తలు రాయాలని సూచించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, పందింటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు,నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, గుడ్లూరు మాల్యాద్రి, కనుపర్తి రాజశేఖర్, షేక్ నాయబ్ రసూల్, మునీర్, తిరువీధి ప్రసాద్, పుల్లా శ్రీనివాసులురెడ్డి, కొమారి రాజు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు కావలి ముస్తాబు

కావలి: చుక్కల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి వేలాది మంది రైతులకు ఆత్మబంధువుగా మారిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికేందుకు కావలి పట్టణం ముస్తాబైంది. తుమ్మలపెంట బీచ్‌రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలోని హెలిప్యాడ్ నుంచి ఉదయగిరి రోడ్డులోని మినీస్టేడియంలోని సీఎం సభా ప్రాంగణం వరకు రోడ్లను వైఎస్సార్‌సీపీ జెండాలు, తోరణాలను అలంకరించారు. రోడ్లకు ఇరువైపులా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో అభిమానులు ఏర్పాటు చేసిన భారీ సీఎం కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నాయి. కావలిని కనక పట్టణంగా మార్చే దిశగా రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. మరోవైపు పరిశ్రమల స్థాపనకు చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కావలికి వస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలియజేసేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధమవుతున్నారు. సీఎం సభకు సుమారు 50వేల మందికిపైగా హాజరయ్యే పరిస్థితులు కనిపిస్తుండటంతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సభాప్రాంగణంలో సీటింగ్, పార్కింగ్, భోజనాలు, తాగునీరు, తదితర ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి అధికారులతో సమన్వయం చేసుకుంటున్నారు.


సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన భారీ కటౌట్లు

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



కలిగిరి: కమ్మవారిపాళెంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం నూతన విగ్రహాలతో పాటు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. సాయంత్రం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

ఆయుష్మాన్ భారత్ సర్వేను పూర్తి చేయాలి

ఉదయగిరి: మండలంలో ఆయుష్మాన్ భారత్ సర్వేను నూరుశాతం పూర్తిచేయాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. పట్టణంలోని బిట్–1 సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరును పరిశీలించి సూచనలు చేశారు. ఇప్పటి వరకు ఆయుష్మాన్ భారత్ సర్వే 55 శాతం మాత్రమే పూర్తయిందన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో నూరుశాతం పూర్తి చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వీడాలన్నారు. ఇప్పటికే 25మంది సచివాలయ ఉద్యోగులకు మెమోలు జారీ చేశామని తెలిపారు. ఆయన వెంట ఈఓ నరసయ్య, సీఏ గాజుల ఇమ్రాన్ ఉన్నారు.


సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

నెల్లూరు(అర్బన్): గర్భిణులను గుర్తించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య ఆదేశించారు. సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులను గుర్తించిన వెంటనే రిజిస్టర్‌లో వివరాలను నమోదు చేసి వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలిస్తూ రక్తహీనతను నివారించాలన్నారు. హైరిస్క్ కేసులను గుర్తించి జిల్లా కేంద్రానికి పంపాలని పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పుల సంఖ్యను పెంచాలని, సాధారణ కాన్పులే నిర్వహించాలని కోరారు. ఏడీఎంహెచ్ఓ వెంకటప్రసాద్, ఎఫ్‌పీసీ నోడల్ ఆఫీసర్ దయాకర్, మలేరియా నివారణ జిల్లా అధికారి బ్రిజిత, డెమో అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పెంచలయ్య

ఏసీలో షార్ట్‌సర్క్యూట్

నెల్లూరు(క్రైమ్): ఏసీలో వైర్లు షార్ట్ సర్క్యూటై అగ్నిప్రమాదం సంభవించిన ఘటన బాలాజీనగర్ పరిధిలోని రామ్‌నగర్‌లో గురువారం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది సమాచారం మేరకు.. రామ్‌నగర్‌లోని మూడోవీధిలో శివకుమార్ కుటుంబం నివాసం ఉంటోంది. ఏసీలో వైర్లు షార్ట్ సర్క్యూటై అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో ఇంట్లోని వారు బయటకు పరుగులు తీసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే పడక గదిలోని వస్తువులతో పాటు విలువైన గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.నాలుగు లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.



17న మండల సర్వసభ్య సమావేశం

వరికుంటపాడు: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఈ నెల 17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ జీ వెంకటలక్ష్మమ్మ ఆధ్వక్షతన జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సంగం: స్థానిక ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కే ఏడుకొండలు గురువారం తెలిపారు. ఎలక్ట్రీషియన్ 40, ఫిట్టర్ 40 సీట్లు ఉన్నాయని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు జూన్ 6వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 98667 20544, 99639 50604 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోవాలి

ఉదయగిరి: ఉదయగిరి ఉపఖజానా కార్యాలయం పరిధిలోని ప్రతి పెన్షన్‌దారుడు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆ కార్యాలయ సీనియర్ అకౌంటెంట్ బొమ్మతట్టు శ్రీహరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపఖజానా కార్యాలయం పరిధిలో 684 మంది పెన్షనర్లు ఉన్నారని చెప్పారు. ఇప్పటివరకు 50 శాతం మంది మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని తెలిపారు. మిగిలిన వారు త్వరగా చేయించుకోవాలని కోరారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



దుత్తలూరు: స్థానిక బీసీ కాలనీకి చెందిన సీనియర్ జర్నలిస్టు పెనుబర్తి మల్లికార్జున ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేల చెక్కును సచివాలయ సిబ్బంది గురువారం అందజేశారు. సర్పంచ్ యనమల సుబ్బమ్మ, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నజీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ దొరసానమ్మ సేవలు చిరస్మరణీయం

ఆత్మకూరు: పట్టణంలో మూడు దశాబ్దాలకు పైగా వైద్యరంగంలో విశేష సేవలు అందించిన డాక్టర్ దొరసానమ్మ చిరస్మరణీయురాలు అని పలువురు స్మరించుకున్నారు. పట్టణంలోని నివాసంలో డాక్టర్ దొరసానమ్మ ఉత్తరక్రియలను గురువారం నిర్వహించారు. పార్టీలకు అతీతంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్, సీపీఎం, తదితర పార్టీల నాయకులు పాల్గొని దొరసానమ్మకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు భర్త వెంకటేశ్వరరావు, అల్లుడు డాక్టర్ ప్రణీత్, కుమార్తె డాక్టర్ హారికను పరామర్శించారు.

1014 పొగాకు బేళ్ల కొనుగోలు

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 1014 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి బీ రాజశేఖర్ తెలిపారు. డీసీపల్లి క్లస్టర్ పరిధిలోని రైతులు 1027 బేళ్లను వేలానికి తీసుకురాగా, 13 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారని చెప్పారు. కిలో పొగాకు గరిష్ఠంగా రూ.200, కనిష్ఠంగా రూ.175 ధర పలికిందని వివరించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు సమష్టిగా పనిచేయాలి

దుత్తలూరు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి కోరారు. గురువారం నందిపాడులో మండల ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు, నాయకులతో సమావేశమయ్యారు. మండలంలో పార్టీ పరిస్థితిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు చేజర్ల చలమారెడ్డి, ఉండేల గురవారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు సింగవరపు వెంకటేశ్వరరెడ్డి, కామేశ్వరరెడ్డి, వెంగళరెడ్డి,అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పోతుగుంట ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


పార్టీ నాయకులతో మెట్టుకూరు ధనుంజయరెడ్డి

సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

అనుమసముద్రంపేట: ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రైతు గ్రూపులకు 40శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తోందని మండల వ్యవసాయాధికారిణి రజని పేర్కొన్నారు. మండలంలోని గుంపర్లపాడులో వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గురువారం ఆమె ప్రారంభించారు. రైతు గ్రూపునకు ట్రాక్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 14 రైతు గ్రూపులు వైఎస్సార్ యంత్ర సేవా పథకానికి అర్హత సాధించాయని తెలిపారు. ప్రతి గ్రూపులో ఐదుగురు రైతులు ఉంటారని చెప్పారు. ఈ పథకం కింద రూ.15 లక్షల విలువైన యంత్ర పరికరాలను ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. సర్పంచ్ రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి, వ్యవసాయశాఖ ఏఈఓ చిరంజీవి, రైతులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ట్రాక్టర్‌ను రైతులకు అందజేస్తున్న ఏఓ, నాయకులు

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

జలదంకి: గ్రామాల్లోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డీపీఓ ఎం సుస్మితారెడ్డి అన్నారు. జమ్మలపాళెం సచివాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి సచివాలయ ఉద్యోగుల హాజరును పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. సచివాలయంలో అందిస్తున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను సచివాలయంలో ప్రచురించాలన్నారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట కావలి డీఎల్‌పీఓ ఆదినారాయణరావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న డీపీఓ సుస్మితారెడ్డి

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని పంచాయతీ కార్యదర్శి సికిందర్, పోస్టల్ అధికారి రమీజ్ అహమ్మద్ సూచించారు. మర్రిపాడు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని గురువారం వారు సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాల పఠనం, పొడుపు కథలు, ఇంగ్లీష్ జంబ్లింగ్ పదాల ఉచ్చారణ, జీకే, గణితం, తదితర అంశాల్లోని మెళకువలను వివరించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎండకు తిరగకుండా వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వీ నారాయణరావు, వివిధ శాఖల అధికారులు సుబ్బారెడ్డి, ఖాజారంతుల్లా, స్థానికులు వేంపాటి శ్రీనివాసులు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సూచనలు చేస్తున్న అధికారులు

గిరిజనులకు అన్నదానం

జలదంకి: జలదంకి పంచాయతీ పరిధిలోని గౌరవరం మేజర్ కాలువకట్టపై నివాసం ఉంటున్న గిరిజనులకు హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. కరోనా మహమ్మారితో మరణించిన ఐడీ పార్టీ హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ ద్వితీయ వర్ధంతి సందర్భంగా గిరిజనులకు అన్నదానం చేసినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షుడు ఘనీబాషా, సభ్యులు పాల్గొన్నారు.



వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వరికుంటపాడు: తిమ్మారెడ్డిపల్లిలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందజేశారు. వైద్యాధికారిణి కరీష్మా 45మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. వేసవి దృష్ట్యా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఏఎన్ఎం రేష్మ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం పడమటికంభంపాడులో ఫ్యామిలీ డాక్టర్ సేవలను గురువారం అందజేశారు. వైద్యాధికారిణి వరలక్ష్మి దీర్ఘకాలిక రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. వైద్యారోగ్య సిబ్బంది నాగమణి, రత్నమ్మ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


సోమశిలలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ఘనంగా ధ్వజారోహణం


ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత గణపతి పూజ, స్వస్తివాచనం, దేవతా ఆహ్వానం, భేరీపూజ, ధ్వజపటానికి ఆవాహన పూజ, ఇంద్రాది అష్టదిక్పాలక ఆవాహన పూజ, ధ్వజానికి సంప్రోక్షణ, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న ధ్వజస్తంభానికి నంది, త్రిశూలం, ఢమరుకం, దర్భసూత్రాన్ని ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ఘనంగా ధ్వజారోహణ చేశారు. అనంతరం కొడిముద్దలను భక్తులకు పంపిణీ చేశారు. వీటిని సంతానం లేని వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు స్వీకరించారు.

క్లుప్తంగా

ఆశీర్వాదం



ఆత్మకూరురూరల్: మండలంలోని నల్లపరెడ్డిపల్లిలో గురువారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏడెం శ్రీనివాసులురెడ్డి కుమారుడు సందీప్‌రెడ్డి వివాహానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరయ్యారు. జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, నాయకులు నోటి వినయ్‌కుమార్ రెడ్డి, బత్తిన నారాయణరెడ్డి, పూనూరు రమేష్ రెడ్డి, ఏడెం పెంచలరెడ్డి, తదితరులు హాజరై వరుడికి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): ఎన్టీఆర్ సేవారత్న, కళారత్న జాతీయ స్థాయి పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వ్యవస్థాపకుడు నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, నృత్యం, సంగీతం, వ్యవసాయం, తదితర రంగాల్లో సేవలందించిన వారు తమ సర్టిఫికెట్లు, పత్రికల క్లిప్పింగులు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తమకు పంపాలని కోరారు. ఆల్ ది బెస్ట్ అకాడమీ, 1 – 20 – 164 గోకుల్‌నగర్, తిరుమలగిరి, సికింద్రాబాద్‌కు ఈ నెల 20లోపు పంపాలని పేర్కొన్నారు. వివరాలకు 96523 47207 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపట్నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

నెల్లూరు(బృందావనం): సుజాతమ్మ కాలనీలోని ఆంజనేయస్వామి మందిరంలో హనుమజ్జయంతి ఉత్సవాలను శని, ఆదివారాల్లో నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ సర్వేపల్లి అజయకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకుపూజ, హనుమాన్‌చాలీసా నృత్యరూపకం, హనుమాన్‌చాలీసా సామూహిక పారాయణాన్ని శనివారం నిర్వహించనున్నామన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు.

వేదగిరిలో హుండీ కానుకల లెక్కింపు




నెల్లూరు రూరల్: నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీ కానుకలను గురువారం లెక్కించారు. కానుకల రూపంలో భక్తులు రూ.7,74,154 మేర సమర్పించారు. నిత్యాన్నదానానికి రూ.80,353 మేర అందజేశారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలపై చర్యలు చేపట్టరూ..

నెల్లూరు(టౌన్): వేసవి సెలవుల్లో తరగతులను నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలల యాజమాన్యలపై చర్యలు చేపట్టాలని ఆలిండియా స్టూడెంట్స్ బ్లాక్ అధ్యక్షుడు చైతన్య కోరారు. ఈ మేరకు స్టోన్‌హౌస్‌పేటలోని కార్యాలయంలో ఆర్ఐఓ వరప్రసాద్‌రావుకు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. జిల్లా కార్యదర్శి రాఖీ, నగర కార్యదర్శి సోనూ, నేతలు రాజీవ్, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



నెల్లూరు(టౌన్): వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులతో పనిచేయించడాన్ని నిలిపేయాలని ఫ్యాప్టో చైర్మన్ సురేంద్రరెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ నారాయణరావుకు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ రమేష్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ శేషు, కార్యవర్గ సభ్యులు దశయ్య, రాజమనోహర్, మురళీధర్, మునాఫ్, చలపతి, పిచ్చిబాబు, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహార పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామ్ ముదిరాజ్ మాట్లాడారు. వేణుగోపాల్‌రెడ్డి సౌజన్యంతో పౌష్టికాహారాన్ని అందించామని చెప్పారు. మేయర్ స్రవంతి, తిరుపతినాయుడు, అనంతరామారావు, తదితరులు పాల్గొన్నారు.